క్లుప్తంగా

మల్లెపాడు గ్రామానికి రోడ్డు మంజూరు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ మల్లెపాడు గ్రామంలో స్థానికుల వినతుల మేరకు ఉన్నతాధికారులు రోడ్డు మంజూరు చేసినట్టు మండల పీసా కమిటీ అధ్యక్షుడు లకే రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మల్లెపాడు గ్రామాన్ని గతంలో మాజీ ఎంపీటీసీ బాలయ్యదొర, మండల పీసా కమిటీ సందర్శించినప్పుడు స్థానికులు పలు సమస్యలు, ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. సొలభం–మల్లెపాడు రోడ్డుకు అనుమతులు వచ్చినట్టు తెలిపారు. గానుగురోలు–సిరిపురం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. రహదారికి నిధులు మంజూరుచేసి గిరిజన గ్రామాలకు రవాణా సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి


మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు

అడ్డతీగల: మదర్ థెరిస్సా వర్ధంతి కార్యక్రమాన్ని అడ్డతీగలలో మదర్ థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన సేవా కార్యక్రమాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి జీవితాంతం మదర్ థెరిసా పాటుపడ్డారని పలువురు అన్నారు. వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు


శబరికొత్తగూడెంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

కూనవరం: మండలంలోని గోదావరి వరద ప్రభావిత శబరి కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కూటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసమూర్తి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు ఆయన చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఓంకార్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా మందులు, పాలు, రొట్టెలు అందజేశారు. సర్పంచ్ కట్టం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఏఎన్‌ఎం హేమలత, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఆశ వర్కరు, ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్వామి, సభ్యులు రాజేష్, శ్రీనివాస్, మహేంద్ర, సోమరాజు, శ్రీలత, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీలను మూసివేయండి


మాట్లాడుతున్న కుంజా శ్రీను

రంపచోడవరం: రంపచోడవరం మండలం నరసాపురంలో రైతులు, స్థానికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న అనధికార మెటల్ క్వారీని మూయించాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను ఆరోపించారు. నరసాపురం గ్రామంలో ఆయన శుక్రవారం గిరిజనులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో మెటల్ క్వారీల బాంబు బ్లాస్టింగ్‌ల వల్ల పొలాలకు నష్టం జరుగుతుందని, ఇళ్లకు బీటలు వారుతున్నాయన్నారు. సమస్యను ఐటీడీఏ పీవోకు పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తులకు ఇబ్బందిగా మారిన ఆయా అనధికార క్వారీలను తక్షణమే మూయించాలని కోరారు.

లాభాల సాగు

- విస్తారంగా వైట్‌బర్లీ పొగాకు సాగు
- గిట్టుబాటు ధరలు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం


పొగాకు తోటలో యంత్రం సహాయంతో దుక్కు దున్నుతున్న రైతు


పక్వానికి వచ్చిన పొగాకు ఆకులను పాకలో ఆరబెట్టిన దృశ్యం (ఫైల్)


రాజవొమ్మంగిలో బర్లీ పొగాకు తోట

రాజవొమ్మంగి: ఈ సీజన్‌లో పండించే వాణిజ్య వైట్‌బర్లీ పొగాకు సాగులో గిరిరైతులు ఆసక్తి కనపరస్తున్నారు. గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. పండిన పంటకు మార్కెట్, డిమాండ్, అనుకూలమైన ధర ఉండడంతో సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం రాజవొమ్మంగి మండలంలో దాదాపు 3,000 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగుచేస్తున్నారు. మన్య ప్రాంతంలో ప్రముఖ పొగాకు కంపెనీ ఐటీసీ (ఇండియన్ టొబాకొ కంపెనీ) ఈ పొగాకు సాగులో రైతులను ప్రోత్సహిస్తోంది. అలాగే అనుకూలమైన భూముల్లో బర్లీ పొగాకు సాగుపై కంపెనీ సూపర్‌వైజర్లు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉచితంగా మొక్కలు అందజేత

ఈ పొగాకులో మంచి నాణ్యత గల బ్యాంకెట్ ఏఐన్ రకం (బీఏ–1) విన్–5, వీబీ–22 వంటి ఆధునిక పొగాకు మొక్కలను (పొగాకు నారును) కంపెనీ సరఫరా చేస్తోంది. కొంతమేర రాజమహేంద్రవరం నర్సరీల నుంచి తీసుకొని వచ్చి రైతులకు అందజేస్తున్నారు. అలాగే స్థానికంగా షేడ్ నెట్‌లో పెంచిన పొగాకు నారుడు కూడా రైతులకు పంపిణీ చేస్తున్నారు. షేడ్ నెట్‌లో పొగాకు నారు (నర్సరీ) పెంచేందుకు ఆసక్తి చూపుతున్న రైతులకు సుమారు రూ.30 వేల విలువైన సరంజామా ఉచితంగా అందజేస్తున్నారు. కాగా ఎకరాలో పొగాకు పండించేందుకు 10,000 మొక్కలు అవసరం అవుతాయి. ఒక మొక్క 50 పైసలు కాగా, ఎకరాకు అవసరమైన పొగాకు నారుకు రైతులు సుమారు రూ.5వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అలాగే రైతులకు పంటకాలంలో అవసరమైన పెట్టుబడితో పాటు వారికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కంపెనీ అందిస్తోంది. ఫెస్టిసైడ్స్, బరకాలు, ఇతర సామగ్రి సబ్సిడీ ధరలకు కంపెనీ అందజేస్తోంది. పొగాకు సాగులో రైతులు ఎకరాకు రూ.20 వేలు నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతోంది. కాగా ఎకరాకు సరాసరిని 8 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటా రూ.15,500 పలుకుతుండగా ఎకరాకు దాదాపు రూ 1.24 లక్షల ఆదాయం పొందుతున్నట్టు రైతులు చెపుతున్నారు. ఏ ఇతర పంటల వల్ల ఇంత ఆదాయం లభించక పోవడంతో గిరిజన రైతులు అధికంగా వైట్‌బర్లీ పొగాకు సాగుపైనే ఆసక్తి కనపరుస్తున్నారు. గత ప్రభుత్వం గిరిజనులకు కొండపోడు భూములపై హక్కులు కల్పించడంతో లోతట్టు అటవీప్రాంతంలో ఈ పొగాకు పంట విరివిగా సాగవుతోంది. అడవిలో నేల కొత్తది కనుక నాణ్యమైన పొగాకు పండుతుందని రైతులు అన్నారు.

చేతి నిండా పని

బర్లీ పొగాకు సాగులో మొక్క నాటింది మొదలు ఆకులు తురిమే వరకు ఇంటిల్లిపాదికి పని ఉంటుంది. దీంతో ఉపాధి కోసం గిరిజన రైతులు ఈ పంటపై మొగ్గు చూపుతున్నారు. మొక్కనాటిన తరువాత కలుపు, మొక్కల మధ్య గొప్పులు తవ్వడం, బోదెలు తీయడం వంటి పనుల్లో రైతులు చేపడుతున్నారు. ఆకులు వెడల్పుగా పెరిగి, చుక్కలు వచ్చి ఆకులు పసుపురంగులోకి మారగానే పంట పక్వానికి వచ్చినట్టు భావిస్తారు. పక్వానికి వచ్చిన ఆకులు కోసం వాటిని తోరణాలుగా కట్టి పాకల్లో ఆరబెడతారు. ఆకులు బాగా ఎండి బంగారు వర్ణంలోకి మారగానే వాటిని 50 నుంచి 100 కిలోల బరువు ఉండేలా బేళ్లు తయారు చేస్తారు. ఈ బేళ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించగానే నాణ్యతను బట్టి కంపెనీ ధర ప్రకటిస్తుంది. కొనుగోలు పూర్తయిన వారంలోగానే సొమ్ములు అందజేస్తారు. ఈ ప్రక్రియకు అలవాటు పడిన గిరి రైతులు బర్లీ పొగాకు సాగుపై ఆశలు పెంచుకొంటున్నారు.

ఆశాజనకంగా ధరలు

నాకున్న అర ఎకరంలో పొగాకు పంటను సాగు చేస్తున్నాను. ఐటీసీ ద్వారా ఉచితంగా మొక్కలు అందజేశారు. పంట సాగుపై సంబంధిత కంపెనీ సూపర్‌వైజర్లు పలు సూచనలిచ్చారు. ఏటా పంటకు మంచి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. కుటుంబసమేతంగా పొలంలో పనులు చేస్తున్నాం. ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉంది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో పంట మంచి ధరలు పలుకుతుందని ఆశిస్తున్నాను.

– రాము, రైతు, రాజవొమ్మంగి

వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

గంగవరం : మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో శనివారం మధ్యాహ్నం పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ తెలిపారు. ఈ సమావేశానికి రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో గ్రామాల్లో నిర్వహించతలపెట్టిన చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంతో పాటు పార్టీకి చెందిన పలు అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలపై కూడా చర్చించనున్నట్టు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని వారి కోరారు.

ఎరువుల పంపిణీ


చిన్నగెడ్డలో ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: ప్రభుత్వం అందజేస్తున్న రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. సచివాలయం–2 చిన్నగెడ్డ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలన్నారు. పీసా కమిటీ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వచ్చారు.. వెళ్లారు

- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలను విస్మరించిన ఎమ్మెల్యే
- బాధితులకు అందని నిత్యావసర సరకులు
- కూటమి ప్రభుత్వంపై గ్రామస్తుల ధ్వజం


ఒడ్డుగూడెంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

వి.ఆర్.పురం: ఎమ్మెల్యే శిరీషదేవి శుక్రువారం వి.ఆర్.పురంలో వరద బాధితులను పరామర్శించారు. గోదావరి వరద ముంపు ప్రాంతాలైన ఒడ్డుగూడెం, రామవరం, చింతరేవుపల్లి గ్రామాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిరీష వరద ముంపు ప్రాంతాల్లో పర్యటనతోనే సరిపెట్టారని చెప్పారు. వరద ప్రభావంతో రోజుల తరబడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు కనీస సాయం చేయలేదని పలువురు చెప్పారు. బాధితులకు కనీసం నిత్యావసర సరకులు అందించలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఓట్ల కోసం దండాలు పెట్టి... ఇప్పుడు కష్టాల్లో ఉన్న బాధితులకు కనీస సాయం చేయకుండా పట్టించుకోకుండా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాయానికి పెద్దపీట

రెండేళ్ల క్రితం వచ్చిన గోదావరి వరదకు ముంపు గ్రామాల్లో అప్పటి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి, వరద బాధితులకు అన్ని విధాలుగా ఆదుకున్నారని ముంపు ప్రాంత ప్రజలు గుర్తు చేస్తున్నారు. బాధితులందరికీ గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిహారం అందించడంతో పాటు నిత్యావసర సరకులు పంపిణీ చేసి ఆదుకొని అండగా నిలిచిందని చెబుతున్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం వరద బాధితులను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం


సమావేశమైన సీపీఎం నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి కోండ్ల సూరిబాబు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాజవొమ్మంగిలో పార్టీ మండల కమిటి సమావేశం జరిగింది. మండలంలో ప్రదానంగా రహదారులు అధ్వానంగా మారాయని రామారావు అన్నారు. గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం సమస్యలు ఉన్నాయన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, పెరిగిన నిత్యావసర వస్తువులపై ఒక ప్రణాళికతో ఉద్యమం చేద్దామని పిలుపు ఇచ్చారు. పింఛన్ల సమస్యను పరిష్కరించేవరకు అధికారులు ప్రశ్నిద్దామన్నారు. నాయకులు సత్యనారాయణ, శ్రీను, జగన్నాథం, రామరాజు, మురళి, రాంబాబు పాల్గొన్నారు.

అన్నవరాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్


ఆందోళన చేస్తున్న పలు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

చింతపల్లి: మండలంలోని అన్నవరం పంచాయతీని మండల కేంద్రంగా ప్రకటించాలని పలు పంచాయతీల ప్రజాప్రతినిధులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అన్నవరం పంచాయతీ సచివాలయం ముందు వారు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలాలు పునర్విభజన చేపడితే అన్నవరాన్ని మండల కేంద్రంగా పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అన్నవరం,తమ్మెంగులు, కుడుముసొరి, బలపం, లోతుగెడ్డ, బెన్నవరం, జి.మాడుగుల మండలంలో ఉన్నటువంటి పాలమామిడి పంచాయతీలను ఒక యూనిట్‌గా తీసుకుని మండల ఏర్పాటు ప్రతిపాదన చేయాలని వారు కోరారు. ఆయా పంచాయతీలు చింతపల్లి మండల కేంద్రానికి 30 నుంచి 50 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయన్నారు. అన్నవరం, తమ్మెంగులు సర్పంచ్‌లు సన్యాసిరావు, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు, మాజీ సర్పంచ్‌లు చిన్నబ్బాయి, సన్యాసిరావు, బాబూరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


పూజలు చేస్తున్న భక్తులు


అల్లూరి వీధిలో మహిళల కోలాటం

సీలేరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రతి మండపం వద్ద భక్తుల్ని ఆకట్టుకునే విధంగా వర్తకులు వేద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్తక సంఘం మండపం వద్ద అర్చకులు దామోదరం శర్మ ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. అల్లూరి వీధిలో మహిళలు కోలాటం నిర్వహించారు. స్థానిక కన్నాబి క్యాంప్, దుర్గా వీధిలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దారకొండలో వినాయక విగ్రహ నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాట జరిగింది. చిత్రకొండకు చెందిన భక్తుడు దార మల్లేశ్వరరావు రూ.17వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


దుంబ్రిగుడలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు సుందర్‌రావు, గెన్ను


చింతపల్లిలో సీడీని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి,రచయిత కృష్ణయ్య తదితరులు


చింతూరులో ఉత్తమ అధ్యాపకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

దుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. భారత రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలో ఉత్తమ ఉపాధ్యాయులను దుశ్శాలువాతో సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి పదవిని అలంకరించిన మహనీయుడు రాధాకృష్ణన్ అని కొనియాడారు. గురువులు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులున్నారు. అంకిత భావంతో పనిచేసి విద్యార్థులకు జీవన నైపుణ్యాలను, నైతిక విలువలను నేర్పించి, నవసమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు శెట్టి సుందరరావు, జి.గెన్ను తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని జరిగిన వేడుకలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, రచయిత కృష్ణయ్యలు కళాశాల చరిత్రను తెలియజేస్తూ రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పాత్రుడు, అధ్యాపకులు జగదీష్, నాగేశ్వరరావు, లీలాపావని, కెజియా రాణి తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు అప్పనమ్మ, శకుంతల, హారతి, శైలజ, నాగమోహన్, సాయికుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగలలో జరిగిన వేడుకలో ఏపీసీసీ కార్యదర్శి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో జరిగిన వేడుకలో ఉపాధ్యాయులు ప్రమీల (టేకులబోరు), జి.నాగదుర్గ(కాచవరం), బి.ఆనంద్(ముల్లూరు)లను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ నేతలు వెంకటనారాయణ, కన్నారావు, నాగేశ్వరరావు, దుర్గ, మహతి, కుమారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో జరిగిన వేడుకలో ఎంతవోలు సత్యన్నారాయణదొర, సూరయ్యరెడ్డి , ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తదితరులు పాల్గొన్నారు.


అడ్డతీగలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కూనవరంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు, తదితరులు


రాజవొమ్మంగిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు , ప్రజాప్రతినిధులు

ఘనంగా వినాయక నిమజ్జనం


వినాయక విగ్రహ నిమజ్జనంలో థింసా నృత్యం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర


ఊరేగింపులో స్థానికుల సందడి

ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని థింసా నృత్యాలతో భారీగా ఊరేగించారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఊరేగింపులో పాల్గొని భక్తులతో కలిసి థింసా నృత్యం చేశారు. సుజనకోట మత్స్యగెడ్డ ఒడ్డున విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో స్థానిక జై దుర్గా వర్తక సంఘం రూ.42,116లకు దక్కించుకున్నారు.


ముంచంగిపుట్టులోని గణనాథుని ఊరేగింపులో యువత సందడి

‘రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం’


అరకులోయలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు రామ్మూర్తి, తదితరులు


అనంతగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, నాయకులు


దుంబ్రిగుడలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, నేతలు


ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు


జీకే వీధిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు


పాడేరులో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు,నేతలు

అరకులోయటౌన్: గిరిజన రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 9న నిర్వహించనున్న రైతు ర్యాలీకి అందరూ తరలిరావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాయకులు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, గూడెం కొత్తవీధి, పాడేరులో జరిగిన సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు స్వాభి రామ్మూర్తి, పాంగి పరశురామ్, పాంగి పద్మారావు, కంకిపాటి ప్రసాద్, సీదరి రాంబాబు, అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం యూరియాను సకాలంలో అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సీజన్‌కు ముందుగానే అందుబాటులో ఉండడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందన్నారు. గిరి రైతులకు యూరియా లేక పంట నష్టపోయి, దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా కోసం పడిగాపులు కాయడంతో పాటు వేలాది రుపాయలు వెచ్చించి, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకోవలసిన దుస్థితి కూటమి ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. విత్తనాలు సైతం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

తరలివచ్చిన నాయకులు..వివిధ మండలాల్లో జరిగిన పార్టీ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అరకులోయలో పార్టీ యువజన నాయకుడు రేగం చాణిక్య, రాష్ట్ర ఎస్టీ వింగ్ ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రామచందర్, మండల పార్టీ కార్యదర్శి సొనియ, మండల పార్టీ ఉపాధ్యక్షులు పల్టాసింగ్, విజయ్‌కుమార్, నాయకులు అశోక్, ప్రకాష్, కిరణ్ కుమార్, అర్జున్, ప్రవీణ్, శేఖర్, రామనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతగిరిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అప్పారావు, నాయకులు ఆనంద్, గంగన్నదొర, స్వామి, కృష్ణమూర్తి, సన్యాసిరావు, డానియేల్, నవీన్, మధుసుదన్‌రావు, శెట్టి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో వైస్ ఎంపీపీఆనంద్, సర్పంచ్ నాగేశ్వరరావు, కార్యదర్శి రామునాయుడు, నాయకులు మల్లేష్, సింహాచలం, కృష్ణరావు, మురళీపట్నాయిక్, విజయదశమి, త్రినాథ్, దాసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో నాయకులు జగబంధు తదితరులు పాల్గొన్నారు. గూడెంకొత్తవీధిలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చంటిబాబు, సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్, నాయకులు రాజేష్, పోతురాజు, రాంబాబు, నారాయణరావు పాల్గొన్నారు. పాడేరులో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బసవన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణపాత్రుడు, నాయకులు దశమూర్తి, బొంజుబాబు, లింగమూర్తి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.